క్లుప్తంగా

ఆర్‌ఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శిగా మహేష్



కర్నూలు(అర్బన్): రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా లా స్టూడెంట్ మహేష్‌ను నియమిస్తూ ఆర్‌ఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు రాజాస్ ప్రవీణ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆలోచనా విధానంతో ముందుకు వెళ్తు విద్యారంగ సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని, ప్రతి నెలా జిల్లాలో ఆర్‌ఎస్‌ఎఫ్ పనితీరుపై అప్‌డేట్స్ పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా నియమించారని, జాతీయ నాయకత్వం నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాలో పటిష్ట ఉద్యమాలను నిర్వహిస్తామని తెలిపారు. త్వరలోనే జిల్లావ్యాప్తంగా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

ఆదాయ మార్గాలపై దృష్టి సారించండి



పెట్రోల్ బంకు సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థకు ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలని అదనపు కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక పాత బస్టాండ్‌లో మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన కేఎంసీ పెట్రోల్ పంపును ఆయన పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెట్రోల్ పంపునకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే కింగ్ మార్కెట్ వద్ద ఉన్న మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించిన అదనపు కమిషనర్ షాపులకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఆర్‌ఓ జునీద్, ఆర్ఐ శేషాద్రి పాల్గొన్నారు.

విజయవాడకు తరలిన మేధావులు

కర్నూలు(సెంట్రల్): విజయవాడలో జరిగే స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యుమెంటరీ ఆవిష్కరణకు జిల్లా నుంచి ఐదు బస్సులు, నాలుగు టెంపోల్లో వివిధ వర్గాల ప్రజలు గురువారం తరలివెళ్లారు. శుక్రవారం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో సీఎం చంద్రబాబునాయుడు డాక్యుమెంట్‌ను ఆవిష్కరించనున్న నేపథ్యంలో జిల్లా నుంచి ఎంపిక చేసిన ప్రొఫెసర్లు, పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు, అధికారులను తీసుకెళ్లారు. కాగా, ఆయా బస్సులను జేసీ డాక్టర్ బి.నవ్య కలెక్టరేట్ ఎదుట జెండా ఊపి సాగనంపారు. వెళ్లిన వారికి సకల సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు ఆమె చెప్పారు. డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్‌కుమార్, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

సి.బెళగల్: మండలంలోని కొండాపురం గ్రామంలో గర్భిణులకు గురువారం ఎంఎల్‌హెచ్‌పీ భరత్ వైద్య పరీక్షలను నిర్వహించారు. గ్రామంలోని హెల్త్ క్లీనిక్‌లో గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు చేశారు. 25 మంది గర్భిణులు, 28 మంది మహిళలు, మరో 12 మందికి బీపీ, సూగర్, హెచ్‌బీ వైద్య పరీక్షలను నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఎల్లనాగమ్మ, ఆశా వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి వెండి కవచం బహూకరణ



నందీశ్వరుడిని వెండికవచంతో అలంకరిస్తున్న బుట్టారేణుక దంపతులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని నీలకంఠేశ్వర ఆలయంలో శ్రీ నీలకంఠేశ్వర స్వామికి, నందీశ్వరుడికి గురువారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక, ఆమె భర్త బుట్టా శివనీలకంఠలు మూడు కిలోల వెండి కవచాలను బహూకరించారు. ఆలయ అర్చకులకు వాటిని అందజేసి వాటిని స్వామివారికి అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శాప్‌నెట్ వర్క్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్, కౌన్సిలర్ కామర్తి నాగేషప్ప, ఎంకే శివకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు సునీల్ కుమార్, గడ్డం నారాయణరెడ్డి, విరూపాక్షిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందేలా పనిచేయండి



నరసింగరావుపేటలోని సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): సచివాలయాలకు వచ్చే ప్రజలు సంతృప్తి చెందేలా పనిచేయాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. గురువారం స్థానిక నరసింగరావు పేటలోని 125, 126వ సచివాలయాలను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, మూమెంట్ రిజిస్టర్‌లను పరిశీలించారు. పన్ను వసూళ్లు, ఎంఎస్‌ఎంఈ సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కష్టతరమైన పనులు ఉంటే సంబంధిత సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సచివాలయాల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.అలాగే జిల్లా కోర్టు, మున్సిఫ్ కోర్టుల ప్రాంగణాలను కమిషనర్ పరిశీలించారు. న్యాయవాదుల అభ్యర్థన మేరకు పార్కింగ్, ఫుట్‌పాత్, పారిశుధ్య పనులకు ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కొండారెడ్డి బురుజు, పెద్ద మార్కెట్, జమ్మిచెట్టు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ కృష్ణలత, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మునిస్వామి పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో వసూలు చేయాలి

నగరపాలక సంస్థకు సంబంధించి నీటి, ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని కమిషనర్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. గురువారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ హాలులో రెవెన్యూ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, అడ్మిన్లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సిబ్బంది సమన్వయం చేసుకొని పన్ను బకాయిలు వసూలు చేయాలన్నారు. రోజువారీ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. మొండి బకాయిలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలను చట్ట పరిధిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కమిషనర్ కృష్ణ, ఆర్‌ఓలు ఆర్ఐలు పాల్గొన్నారు.

లాభసాటి గొర్రెల పెంపకంపై అవగాహన





మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసులు, పాల్గొన్న అధికారులు, సభ్యులు

- నేషనల్ లైవ్ స్టాక్ కార్పొరేషన్ ద్వారా రూ.కోటి వరకు రుణాలు
- 50 శాతం వరకు సబ్సిడీ
- ఎన్‌సీడీసీ రుణాల రికవరీపై దృష్టి సారించండి
- జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ సూచనలు

కర్నూలు (అగ్రికల్చర్): గొర్రెల పెంపకాన్ని అభివృద్ధి చేసేందుకు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ 50 శాతం సబ్సిడీతో రుణ సదుపాయం కల్పిస్తోందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణ సదుపాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. గురువారం యూనియన్ కార్యవర్గ సమావేశం బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలోని సమావేశ మందిరంలో జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెల పెంపకాన్ని లాభసాటిగా అభివృద్ధి చేసుకునేందుకు శాస్త్రీయ పద్ధతులు పాటించే విధంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) ద్వారా గొర్రెల పెంపకానికి పంపిణీ చేసిన రుణాల రికవరీపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రూ.1.50 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, 20 మంది రుణం పొందినప్పటి నుంచి రూపాయి కూడా చెల్లించలేదని పేర్కొన్నారు. రుణాలు రికవరీ అయితే ఎన్‌సీడీసీ రెండో విడత రుణాల పంపిణీ చేసేందుకు నిధులు ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. గొర్రెల పెంపకందారుల అభ్యున్నతికి తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గొర్రెల అభివృద్ధి విభాగం ఏడీ సుభాన్‌బాషా, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ శ్రీనివాసరెడ్డి, ప్యాపిలి గొర్రెల శిక్షణా కేంద్రం అధికారులు, యూనియన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి



వార్డు సచివాలయం ఎదుట విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: ట్రూ అప్ పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కల్లూరు అర్బన్ ముజఫర్‌నగర్‌లోని 81, 82వ వార్డు సచివాలయాల ఎదుట సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. కూటమి సర్కార్ తీరును నిరసిస్తూ విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు సుధాకరప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు చంద్రబాబు నాయుడు ప్రజలపై కరెంటు చార్జీలు పెంచబోనని ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరించారన్నారు. అధికారంలోని వచ్చిన వెంటనే విద్యుత్ ట్రూఅప్ పేరుతో రూ. 20 వేల కోట్లు భారం మోపుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖలీల్ అహమ్మద్, కాశన్న, మాదన్న, ఈశ్వరమ్మ, కుమారి, లక్ష్మిదేవి, సురేఖ, సలోమి, ఖరీఫా, విజయ, రఫీయా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ శాఖ చేపడుతున్న అభివృద్ధి పనుల నేపథ్యంలో శుక్రవారం నగరంలోని వన్‌టౌన్, క్యాంపు సెక్షన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గురువారం ఈఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. వన్‌టౌన్ పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, క్యాంపు సెక్షన్ పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 12 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'చలో గుంటూరు' పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు(సెంట్రల్): మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించనున్న 'హలో మాల..చలో గుంటూరు' కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్దఎత్తున మాలలు తరలిరావాలని మాల సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. గురువారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట మాల విద్యార్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశరపు వెంకటేష్, బి.రాజేష్‌కుమార్, మాధవ స్వామి, నవ్యాంధ్ర జేఏసీ అధ్యక్షుడు ఆవుల అయ్యస్వామి, దామోదరం రాధాకృష్ణమూర్తి, మహేష్, చెన్నకేశవులు, లింగన్న, ఆనంద్, నాగేంద్ర, నారాయణ, రంగస్వామి తదితరులు 'హలో మాల..చలో గుంటూరు' పోస్టర్లను ఆవిష్కరించారు.

నేడు గిప్సన్ చర్చిలో ప్రార్థనలు

కర్నూలు (టౌన్): నగరంలోని గిప్సన్ సెంట్రల్ బాప్టిస్టు చర్చిలో శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు క్రిస్మస్ క్యారెల్స్, క్యాండిల్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు క్రిస్మస్ కమిటీ సభ్యులు మాధవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కర్నూలులోని యునైటెడ్ థియోలాజికల్ సెమినార్ ప్రిన్సిపాల్ రెవరెండ్ డాక్టర్ బి.మణిమంజుల హాజరై దైవ సందేశం ఇస్తారని తెలిపారు. పెద్ద సంఖ్యలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొని దేవుని ఆశీస్సులు పొందాలన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

కర్నూలు (టౌన్): క్రీస్తు మార్గం అనుసరణీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక మౌర్య ఇన్‌లోని సమావేశ హాలులో నగరంలోని పాస్టర్లతో కలిసి క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏవరైతే చేసిన తప్పులు సరిదిద్దుకొని సరైన మార్గంలో నడుచుకుంటారో వారికి దేవుడి దీవెనలు ఉంటాయన్నారు. తాము అధికారంలో ఉన్నా, లేకున్నా.. క్రైస్తవులకు తమ వంతు సహకారం అందించామన్నారు. పాస్టర్లు ప్రసాద్, శ్యామేల్, ఏసుబాబు, అవిలన్ బాబు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన నిరసనలు

- నగరంలో ర్యాలీ చేపట్టిన ఇంజినీరింగ్ కార్మికులు
- అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి



ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు సంఘీభావం ప్రకటించిన పుల్లారెడ్డి

కర్నూలు (టౌన్): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. విధులను బహిష్కరించి కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం నాలుగవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక పాతబస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నుంచి పాతబస్టాండ్, కొత్తపేట మీదుగా నగర పాలక సంస్థ వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 నుంచి 30 సంవత్సరాలుగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో నీటి సరఫరా, వాటర్‌మెన్, ఫిట్టర్స్, లీకేజీ మెకానిక్స్, పంప్ ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్స్, వీధి దీపాలు, కంప్యూటర్ ఆపరేటర్స్ ట్యాప్ ఇన్‌స్పెక్టర్స్ ఇలా 300 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. చాలీచాలనీ వేతనాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లేక, అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా ర్యాలీలు, ధర్నాలు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె చేస్తామని స్పష్టం చేశారు. అసోసియేషన్ నాయకులు మనోహర్, జ్ఞానమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుల్లారెడ్డి సంఘీభావం

నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుల్లారెడ్డి సంఘీభావం తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్మికులకు మద్దతుగా నిలుస్తామని స్పష్టం చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ఐసీడీఎస్ పీడీకి వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

కర్నూలు న్యూసిటీ: దేశ భావిభారత పౌరులైన చిన్నారులను తీర్చిదిద్దుతున్న అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలలిత, జిల్లా ప్రధాన కార్యదర్శి చౌడేశ్వరి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు గురువారం ఐసీడీఎస్ కార్యాలయంలో పీడీ వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సిబ్బందికి అన్ని యాప్‌లను రద్దుచేసి ఒకే యాప్ కిందకు తీసుకురావాలని కోరారు. వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందించాలని, విధి నిర్వహణలో మృతి చెందిన సిబ్బంది మట్టి ఖర్చులకు రూ.20 వేలు అందజేసి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా, నగర కార్యదర్శులు మునెప్ప, చంద్రశేఖర్ ఐద్వా నాయకురాలు నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న మహిళా పోలీసు స్టేషన్ సీఐ ఆదిలక్ష్మి

కర్నూలు సిటీ: విధులు నిర్వహించే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు నేరం రుజువైతే కఠిన చర్యలు ఉంటాయని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఆదిలక్ష్మి అన్నారు. గురువారం డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి అధ్యక్షతన లైంగిక వేధింపులను నిర్మూలించేలా అవగాహన సదస్సు నిర్వహించారు. పని ప్రదేశాల్లో పురుషులు, మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు చట్టాలపై అవగహన కలిగి ఉండాలన్నారు. ప్రతి మహిళలో ఓ తల్లి, చెల్లి, కూతురును చూడగలిగితే ఎలాంటి అఘాయిత్యాలు చోటు చేసుకోవని ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి అన్నారు. వైస్ ప్రిన్సిపాళ్లు హేమంత్, సత్యనారాయణ, మహిళ సాధికారత విభాగం కన్వీనర్ ఎస్.షాజిదాబీ, కాలేజీ ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ ఎస్.వక్రున్నీసా బేగం, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహాల ప్రతిష్టోత్సవాలు



ప్రతిష్ఠించనున్న సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలు

కోడుమూరు రూరల్: మండల కేంద్రం కోడుమూరులోని హంద్రీనది ఒడ్డున వెలసిన పక్కీరప్ప తాత ద్వితీయ ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాల ప్రతిష్టోత్సవాలను శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు భక్త బృందం సభ్యులు తెలిపారు. 13వ తేదీన ఉదయం విష్వక్సేన ఆరాధన, పుణ్యహవాచనం, విష్ణు సహస్రనామపారాయణం, కుంభారాధన, యాగశాల ప్రవేశం కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదేవిధంగా 14న సుప్రభాతము, కుంభ దేవతారాధన, ప్రధాన దేవతా హోమం, 15న ఉదయం యంత్ర స్థాపనం, శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాలు, కలశ ప్రతిష్ట కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

పాఠశాల తనిఖీ

సి.బెళగల్: మండల పరిధిలోని కొండాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలను గురువారం మండల ప్రత్యేకాధికారిని, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులతో చర్చించారు. అదేవిధంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన వడ్డింపు తీరుపై ఆరా తీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందజేయాలని సూచించారు.

నదిలో స్నానానికి వెళ్లి పంజాబ్ వాసి మృతి



నదిలో నుంచి మృతదేహాన్ని తీసుకొస్తున్న స్థానికులు

కర్నూలు(రూరల్): నదిలో స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు పంజాబ్ వాసి మృతి చెందిన ఘటన బుధవారం కర్నూలు మండలంలో చోటుచేసుకుంది. ఘటనపై కర్నూలు తాలుకా ఎస్ఐ యం .నరేష్ తెలిపిన వివరాల మేరకు.. పంజాబ్ రాష్ట్రం, జలంధర్ పట్టణనికి చెందిన దుగ్గాల నరేష్ (42) బుధవారం సాయంత్రం 6 గంటలకు కర్నూలు మండలం పంచలింగాల గ్రామ సమీపంలో తుంగభద్ర నదిలో స్నానం చేసేందుకు దిగాడు. ప్రమాదవశాత్తు నది లోతుకు వెళ్లడంతో ఈత రాక నీటమునిగి మృతిచెందాడు. గురువారం నదిలో శవం తెలియాడుతున్నట్లు స్థానిక ప్రజలు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని బయటికి తీసి విచారణ చేపట్టారు. మృతిచెందిన నరేష్ రెండు నెలల క్రితమే పంచలింగాల పరిధిలోని ధూమ్ డాబాలో సర్వర్‌గా పనిలో చేరినట్లు నిర్వాహకులు తెలిపారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మార్చురీకి తరలించారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ భాస్కర్

ఓర్వకల్లు: గ్రామాలలో సుస్థిర అభివృద్ధిని సాధించాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రభుత్వం చేపట్టిన సుస్థిర అభివృద్ధి-లక్ష్యాల సాధనలో భాగంలో గ్రామ సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందికి రెండోరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డీపీఓ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అనంతరం పేదరిక నిర్మూలన, మహిళ, శిశువు సంరక్షణ, క్లీన్ అండ్ గ్రీన్ అంశాలపై రీసోర్స్ పర్సన్లు ఉప్పలపాడు పంచాయతీ కార్యదర్శి గోపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజీమా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు శిక్షణ ఇచ్చారు.

కర్నూలు(రూరల్): మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం అధికారులు, సర్పంచ్‌లకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై ఎంపీడీఓ రఘునాథ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో ఈవీ సుబ్బారెడ్డి హాజరై మాట్లాడారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పాటుపడాలని సూచించారు.

కల్లూరు: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల స్థిరమైన అభివృద్ధి స్థానికీకరణ లక్ష్యాల ద్వారా సాధ్యమవుతుందన్నారు.

నేటి నుంచి అయ్యప్ప విళక్కి పూజలు

కర్నూలు కల్చరల్: అయ్యప్ప దీప మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు కర్నూలు నగరంలోని మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో అయ్యప్పన్ విళక్కు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు సప్తగిరి మణికంఠ అయ్యప్పస్వామి దేవాలయం నుంచి మున్సిపల్ పాఠశాల మైదానం వరకు రథోత్సవం, రాత్రి సింగారి మేళం, 14వ తేదీ ఉదయం మహా గణపతి హోమం, 7 గంటలకు అయ్యప్ప పునఃప్రతిష్ట, దీపారాధన, 10.30 గంటలకు లక్ష శరణుఘోష అర్చన, సాయంత్రం 3 గంటలకు రథోత్సవం, రాత్రి 8.30 గంటలకు దీపారాధన, 15వ తేదీ ఉదయం 1.30 గంటలకు కేరళకు చెందిన భక్తులచే అయ్యప్పన్ విళక్కు, 5 గంటలకు అగ్ని ప్రవేశం, మంగళహారతితో వేడుకలు ముగుస్తాయని పేర్కొన్నారు. అయ్యప్ప దీక్షా పరులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కుంభమేళాకు విరాళం ఇవ్వండి

కర్నూలు(అగ్రికల్చర్): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగే కుంభమేళాను పర్యావరణహితంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరు సహకరించాలని కర్నూలు నగర పర్యావరణ సంరక్షణ విభాగం అధ్యక్షుడు తోట హరికృష్ణ కోరారు. జనవరి 13 నుంచి 26వ వరకు జరిగే కుంభమేళాకు ప్రపంచ నలుమూలల నుంచి 40 కోట్ల మంది వస్తారనే అంచనా ఉందని, రోజూ 1200 టన్నుల చెత్త ఉత్పన్నం అవుతుందని వెల్లడించారు. ఈ చెత్తను తగ్గించేందుకు కుంభమేళాలో బట్ట సంచులు, స్టీల్ కంచాలు వాడే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కుంభమేళా కోసం ప్రతి ఒక్కరు ఒక స్టీల్ కంచం, బట్ట సంచి విరాళం ఇవ్వాలని కోరారు. ఇందుకు స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరించాలని కోరారు. విరాళంగా వచ్చిన వాటిని కంభమేళాలో వినియోగించడం జరుగుతుందని, తద్వారా చెత్తను తగ్గించవచ్చన్నారు. వివరాలకు 94400 51336 నంబరుకు ఫోన్ చేయవచ్చని వెల్లడించారు.

11 నుంచి శాంతి సదస్సు

కర్నూలు కల్చరల్: నృత్యజ్యోతి ఫైన్స్ ఆర్ట్స్ అకాడమీ 25వ వార్షికోత్సవం, టీజీవీ ఫైన్స్ ఆర్ట్స్ అకాడమీ మొదటి వార్షికోత్సవం పురస్కరించుకొని జనవరి 11వ తేదీ నుంచి మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీజీవీ ఫైన్స్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు కేవీ భార్గవకుమార్ తెలిపారు. సౌత్ ఏషియన్ పీస్ కాన్ఫరెన్స్, ఇంటర్నేషనల్ యూత్ కల్చరల్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీకి చెందిన సౌత్ ఏషియా ఫెటర్నిటీ యూత్ ఆర్గనైజేషన్ వారు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. నృత్య పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి పొందిన విజేతలు జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.